www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025
5
ఏలూరు



సురక్షిత ప్రాంతాలకు సంచార కుటుంబాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


తుపాన్ నేపథ్యంలో గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఇక్క వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్న సంచార కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు మండల ప్రత్యేకాధికారి జంగారెడ్డిగూడెం (డి.ఎల్.పి.ఒ) ఆకుల సుబ్బారాయన్ తెలిపారు. సోమవారం జీలుగుమిల్లిలోని కామయ్యపాలెం రోడ్డులో ఖాళీ ప్రదేశంలో ఉంటున్న 13 సంచార కుటుంబాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి తరలించి తాత్కాలిక ఆశ్రయాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావం నేపథ్యంలో మూడు రోజులపాటు ప్రజలెవరూ చెట్ల కింద, ఉండటం అనవసరంగా బయట తిరగొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్ ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్, తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, సర్పంచ్ చిర్రి జగదాంబ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

- అన్నదాతకు 'మొంథా' గుబులు..
- తుపాను ప్రభావంతో కమ్ముకున్న ముసురు
- చివరి దశలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరి పంట
- 90 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- ఇప్పటికే రెండు జిల్లాల్లో దాదాపు ఐదు వేల ఎకరాల్లో పంట మునక
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- పునరావాస కేంద్రాలు, తుపాను సహాయక కేంద్రాలు ఏర్పాటు
- సోషల్‌మీడియా ద్వారా గ్రామాల్లో టాంటాం వేయిస్తూ ప్రజలకు అవగాహన
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ప్రత్యేక అధికారులు వేర్వేరుగా అధికారులతో సమీక్షలు

హై.. అలెర్ట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మొంథా' తుపాను హెచ్చరికలతో అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తుపాను తీరం దాటే సమయంలో దాదాపు 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చేతికందిన వచ్చిన పంట అందకుండా పోతోందన్న భయం మట్టి మనిషికి నిద్రలేకుండా చేస్తోంది. తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం నుంచి ముసురు కమ్ముకుంది. వర్షం పడుతూనే ఉంది. మంగళవారం కాకినాడ వద్ద తుపాను తీరందాటనుందని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి



ఉంగుటూరు మండలంలో పక్వానికి చేరిన వరి పంట

జిల్లాల్లో పెద్ద ఎత్తున భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే హెచ్చరికలు జారీ అయ్యాయి. అల్పపీడన ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలూరు జిల్లాలో 1,987 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2,900 ఎకరాలు మొత్తంగా దాదాపు ఐదు వేల ఎకరాల్లో వరి పంట ముంపునకుగురైన పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ పంట గింజ గట్టిపడడం, ఈనిక, పొట్టదశలో ఉంది. ఈ సమయంలో ఈదురుగాలులు వీస్తే పంటంతా నేలకొరిగే ప్రమాదం ఉంది. భారీ వర్షాలకు పంటంతా దెబ్బతినే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అదే విధంగా పత్తి రైతులు సైతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పత్తిసాగు ఎక్కువగా సాగుతోంది. ప్రస్తుతం పత్తి పంట కోత దశలో ఉంది. తీసిన పంట వర్షాలకు తడిసిపోతుండడంతో రైతులు తీవ్ర నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయాధికారులు వర్షం, గాలులు వస్తే పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లో ముందుగానే బోదెలు తీసుకుని వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వరిపైరు నేలకొరిగితే ఉప్పునీరు పిచికారీ చేయడం వంటి పలు అంశాలను రైతులకు చెబుతున్నారు. తుపాను తీరందాటే సమయంలో గాలులు వీస్తే మాత్రం రెండు జిల్లాల్లో తీవ్ర పంట నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. పంటలు బాగా ఉన్నాయని అంతా సంతోషంగా ఉన్నారు. ఈ తరుణంలో మొంథా తుపాను ఆరుగాలం పడిన కష్టాన్ని ఛిద్రం చేస్తున్న భయం రైతులను వెంటాడుతోంది.

అధికారులు అప్రమత్తం..

తుపాను హెచ్చరిక నేపథ్యంలో రెండు జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాకు నియమించిన ప్రత్యేకాధికారులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి తీసుకున్న చర్యలను పరిశీలిస్తున్నారు. రెండు జిల్లాలో ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో తీర ప్రాంతం ఎక్కువగా ఉండడంతో తుపాను తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అవసరమైతే 26 పక్కా భవనాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచారు. 36 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. ఏలూరు జిల్లాలో 11 లంక గ్రామాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని గుర్తించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. 82 తుపాను సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోషల్‌మీడియాతో పాటు గ్రామాల్లో టాంటాం వేయిస్తూ తుపానుకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ముందస్తుగా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. రాత్రికి వర్షం జోరు మరింత పెరిగే అవకాశం ఉండడంతో తుపాను ప్రభావం తీవ్రంగా ఉండనున్నట్లు అంచనా వేస్తున్నారు.

ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే

'మొంథా' తుపాన్ ఈ నెల 28వ తేదీ రాత్రిలోగా మచిలీపట్టణం - కళింగపట్నం మధ్య తీరం దాటొచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆ సమయంలో తీవ్ర వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే చెప్పారు. కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం తీసుకున్న తుపాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎంజె. అభిషేక్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంతిలాల్‌దండే మాట్లాడుతూ తుపాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి నష్టం కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు 82 తుపాన్ సహాయక కేంద్రాలను గుర్తించడం జరిగిందని, వాటిలో కలిదిండిలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి 42 కుటుంబాలను తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో 301 మైనర్ ఇరిగేషన్ చెరువులు సమస్యాత్మకమైనవిగా, వాటిలో 129 మైనర్ ఇరిగేషన్ చెరువులు ప్రమాదకరమైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. తుపాన్ సమయంలో పెనుగాలులు వీచే అవకాశం ఉన్న దృష్ట్యా జిలాల్లో 763 హోర్డింగులు తొలగించడం జరిగిందన్నారు. తుపాన్ ముంపు గ్రామాల్లో 100 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని, 123 మంది గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. 11 లంక గ్రామాల్లో ప్రజలకు నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కల్వర్టులు, కాజ్‌వేల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని పహారా ఉంచామన్నారు. జిలాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, పూరిళ్లు 7,279గా గుర్తించామని తెలిపారు. ఉప్పుటేరు బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోదన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ 'మొంథా' తుపాన్ ప్రభావంతో మంగళవారం జిల్లాలోని 13 మండలాల్లో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 14 మండలాల్లో హై అలెర్ట్ ప్రకటించడం జరిగిందన్నారు. తుపాన్ సమయంలో గాలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో జిల్లాలోని 763 హోర్డింగులు తొలగించామని తెలిపారు. తుపాన్ గాలి తీవ్రత, భారీ వర్షాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అత్యవసరం అయితే తప్ప ప్రజలెవ్వరూ బయటకు రావొద్దని, జిల్లా యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

నూజివీడులో ఎస్‌పి, సబ్‌కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



నూజివీడులో పర్యటించిన ఎస్‌పి, సబ్‌కలెక్టర్

మొంథా తుపాను నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు ముమ్మరం చేసింది. సోమవారం జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, సబ్ కలెక్టర్ వినూత్న, డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్, పోలీస్, రెవెన్యూ అధికారుల బృందంతో కలిసి నూజివీడు ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అధికారుల బృందం ముఖ్యంగా నూజివీడులోని మొగల్ చెరువు పరిసర ప్రాంతాలు, తుపాను ప్రభావానికి గురయ్యే లోతట్టు ప్రాంతాలను పరిశీలించింది. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. తుపాను తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున, అధికారులు సూచించిన సురక్షిత శిబిరాలకు తరలివెళ్లడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం కోసం పోలీస్, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండేలా ఏర్పాట్లను సమీక్షించారు. ఇడిఆర్‌ఎఫ్ సహాయక బృందాలను, పడవలు, రెస్క్యూ కిట్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందకుండా అధికారులు చెప్పే సూచనలు, హెచ్చరికలు పాటించాలన్నారు. టార్చ్‌లైట్, బ్యాటరీలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టె, తాగునీరు, పాడవ్వని ఆహార పదార్థాలు, ప్రాథమిక చికిత్సా కిట్, మందులు, నగదు వంటివి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పత్రాలు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ బ్యాగుల్లో భద్రపర్చుకోవాలన్నారు. పశువులు, ఇతర పెంపుడు జంతువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. బలహీనమైన చెట్లు, పాత గోడలు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. సహాయం కోసం పోలీస్, విపత్తు నిర్వహణ హెల్ప్ లైన్ నెంబరు 112, ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్ అగ్నిమాపక శాఖ 101కు తెలియజేయాలని తెలిపారు.

15 బస్ సర్వీసులు రద్దు..

ఏలూరు అర్బన్: మొంథా తుపాన్ కారణంగా పశ్చిమగోదావరి జిల్లాలో మంగళవారం 15 సర్వీసులు రద్దు చేస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. సోమవారం రాత్రికి భీమవరం డిపో నుంచి తిరుపతి సర్వీసు రద్దు చేస్తున్నట్లు, మంగళవారం తిరుపతి సర్వీస్‌తో పాటు హైదరాబాద్ సర్వీసులు మూడు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు మొత్తం 15 సర్వీసులు రద్దు చేస్తున్నామని మంగళవారం తుపాను ప్రభావాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అలాగే ఏలూరు జిల్లాలో సోమవారం సాయంత్రానికి ఎలాంటి సర్వీసులూ రద్దు కాలేదని, జిల్లా వ్యాప్తంగా అన్ని బస్సులూ తిరుగుతున్నాయని, మంగళవారం తుపాను ప్రభావాన్ని బట్టి కాజ్వేలు, కల్వర్టులు వంటివి పొంగి ఆటంకం ఏర్పడితే అవసరం మేరకు సర్వీసులు రద్దు చేసే అవకాశం ఉందని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కె.షబ్నం తెలిపారు.

పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయాలి

తుపాన్ పర్యవేక్షణ జోనల్ ప్రత్యేకాధికారి ఆర్‌పి.సిసోడియా

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న తుపాన్ పర్యవేక్షణ జోనల్ ప్రత్యేకాధికారి సిసోడియా

తుపాన్ సమయంలో ప్రజలు కాజ్‌వేలు, కల్వర్టులు దాటకుండా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తుపాన్ పర్యవేక్షణ జోనల్ ప్రత్యేకాధికారి ఆర్‌పి.సిసోడియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలో తుపాన్ ముందస్తు చర్యలపై ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుఫాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెసి ఎంజె.అభిషేక్ గౌడ్‌తో కలిసి సిసోడియా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ తుపాన్ తీవ్రతపై ముఖ్యమంత్రి స్పందించి రాష్ట్రంలో ఎక్కడా ఎటువంటి నష్టం సంభవించకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. తుపాన్ మంగళవారం తీరం దాటే అవకాశం ఉన్నందున తీవ్రమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తుపాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు తుపాన్ ప్రమాదం తొలగిపోయే వరకూ వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే నివాసం ఉండి, ముందస్తు జాగ్రత్త చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిలాల్లో తుపాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన వాటికి సంబంధించి ప్రజలకు 82 సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని, కలిదిండిలో ఒక తుపాన్ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తూపాన్ సమయంలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో ప్రమాదకరమైనవిగా గుర్తించిన కాజ్‌వేలు, కల్వర్టులు ప్రజలెవ్వరూ దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడంతోపాటు పోలీస్, రెవెన్యూ సిబ్బందితో పికెట్లు ఏర్పాటుచేయాలన్నారు. తుపాన్ సహాయక సిబ్బంది వద్ద టార్చ్‌లైట్లు, రైన్ కోట్, సెల్‌ఫోన్ ఛార్జర్లను తమ వెంట సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో తుపాన్, తీవ్రగాలులపై ప్రజలకు అవగాహన కల్పించి రానున్న మూడు రోజులపాటు ప్రజలు బయటకు రాకుండా అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు మూడు రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, ఆహార ధాన్యాలు, తాగునీరు వంటివి ఉంచుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రాములు నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు 54 రైళ్లు రద్దు

రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భగవాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మొంథా తుపాన్ కారణంగా సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో మంగళ, బుధవారాల్లో నడిచే 54 రైళ్లను రద్దు చేశారు. ఇందులో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 26 పాసింజర్ రైళ్లు మంగళ, బుధవారాల్లో రద్దు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రైళ్లలో విజయవాడ భీమవరం, భీమవరం నిడదవోలు, నిడదవోలు భీమవరం, భీమవరం విజయవాడ, విజయవాడ నర్సాపురం, నర్సాపురం రాజమండ్రి, నర్సాపురం విజయవాడ, భీమవరం నరసాపురం, నర్సాపురం గుంటూరు, నరపురం నిడదవోలు, రాజమండ్రి భీమవరం రైళ్లు రద్దు అయ్యాయి. అలాగే ఏలూరు జిల్లాకు సంబంధించి విజయవాడ రాజమండ్రి, విజయవాడ కాకినాడ, రాజమండ్రి విజయవాడ, కాకినాడ విజయవాడ రైళ్లు రద్దు అయ్యాయి. ముందుగా సోమవారం తిరిగే విశాఖపట్నం సికింద్రాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం మహబూబ్‌నగర్ లింక్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం సికింద్రాబాద్ గరీబ్ రథ్, విశాఖపట్నం న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినప్పటికీ సోమవారం సాయంత్రానికి తుపాను ప్రభావం అంతగా లేకపోవడంతో తిరిగి వీటిని పునరుద్ధరించినట్లు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భగవాన్ తెలిపారు.


పునరావాస కేంద్రానికి 4 కుటుంబాల తరలింపు

ద్వారకాతిరుమల : తుపాను కారణంగా గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా ద్వారకాతిరుమలలోని ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న యానాదుల కాలనీలోని 4 కుటుంబాలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. ద్వారకాతిరుమల సర్పంచి కె.స్వర్ణలత, ఇంఛార్జి పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాస్, విఆర్‌ఒలు మహాలక్ష్మి, భవానీ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్ పాల్గొన్నారు.

మొంథాపై జిల్లా యంత్రాంగం సిద్ధం

మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



మాట్లాడుతున్న మనోహర్

మొంథా తుపాన్ ప్రభావం మంగళవారం మధ్యాహ్నం నుంచి మరింతగా ఉండే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో గౌతమి సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అధికారులు అత్యవసర చర్యలు చేపట్టారని తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా సమీక్షాధికారి క్రాంతిలాల్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సక్రమంగా పని చేస్తుందన్నారు. తుపాన్ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు 48 గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి ట్రైనింగ్ కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో 27 రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 534 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వారికి భోజనం, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. జిల్లాలోని 1,125 రేషన్ షాపుల్లో, 583 షాపులకు 20 శాతం అదనంగా రేషన్ పంపిణీ చేయాలంటూ ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. రైతుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, 234 రైతు సహాయ కేంద్రాలకు ప్రతి ఒక్కటికి 30 టార్పాలిన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పండించిన పంటలకు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఇప్పటివరకు 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా కైకలూరు- నూజివీడు ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసినట్లు తెలిపారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో మానిటరింగ్ చేస్తున్నారని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై చెట్లు, కొమ్మలు తొలగించేందుకు ఆర్అండ్‌బి, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లాలో రెండు వేలు కరెంటు స్తంభాలు పాతవిగా ఉండడంతో కొత్తవాటిని ఏర్పాటు చేశామని, 211 బిఎస్ఎన్ఎల్ టవర్లకు విద్యుత్ అంతరాయం రాకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి, ఉచితంగా డీజిల్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా మంగళవారం కొల్లేరు ప్రాంతం తుపాన్ పరిస్థితిని స్వయంగా సమీక్షించనున్నట్లు వెల్లడించారు.

పౌర సరఫరాల శాఖ నుంచి అన్ని చర్యలు

మొంథా తుపాన్ విజృంభిస్తున్న నేపథ్యంలో సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ నుంచి ప్రజలకు ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా 12 జిల్లాల్లో ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేపు ఉదయం తొమ్మిది గంటల నుంచి రేషన్ అందుబాటులోకి వస్తుందని,12 జిల్లాల్లో 14,145 రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేస్తామని, సుమారు ఏడు లక్షల మంది కార్డు దారులు లబ్ధి పొందుతారని చెప్పారు. రానున్న మూడు రోజులు కూడా పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ అంతరాయం ఉన్నచోట జనరేటర్‌లోకి డీజిల్ పౌర సరఫరాల శాఖ ద్వారానే అందిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి ఇబ్బంది లేకుండా 30 వేల టార్పలిన్లను అందుబాటులోకి తీసుకొచ్చా మని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగస్తులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రతి ఒక్క ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వ్యకాస జిల్లా మహాసభ వాయిదా

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 27, 28, 29వ తేదీల్లో టి.నరసాపురంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ నవంబరు 4, 5, 6 తేదీలకు వాయిదా వేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ మార్పును వ్యవసాయ కార్మికులు, నాయకులు గమనించాలని, నవంబరులో జరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అసైన్డ్ భూములకు ఫ్రీ హోల్డ్ నిషేధం ఎత్తివేత దారుణం

9/77 చట్టాన్ని యథాప్రకారం అమలు చేయాలి : వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న రామకృష్ణ

అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/77 చట్టాన్ని యథాప్రకారంగా అమలు చేయాలని, అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను కోల్పోయిన దళిత, గిరిజన బలహీన పేదలకు తిరిగి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని త్వరలోనే తొలగించి రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని ఈ నెల 24న జరిగిన మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖండించారు. స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఎం.జీవరత్నం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఇది భూ కబ్జాదారులకు తీపికబురు, లక్షలాది మంది దళిత బలహీన తరగతులకు చేదు కబురని ఎద్దేశా చేశారు. గడిచిన ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందిన దళిత, బలహీన తరగతులకు చెందిన అసైన్డ్ భూములను పలుకుబడి కలిగిన వారికి, గ్రామీణ సంపన్నులకు కట్టబెట్టడానికే ఈ ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడానికి రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం చేసిందని విమర్శించారు. 2023లో ఆనాటి వైసిపి ప్రభుత్వం గడచిన 50 ఏళ్లలో అసైన్డ్ భూములు పొందిన పేదలు 20 ఏళ్లు అనుభవించిన తర్వాత అమ్ముకోవచ్చని, కొనుగోలు చేయొచ్చని 9/77 చట్టాన్ని సవరించిందని తెలిపారు. ఆనాడు వ్యవసాయ కార్మిక సంఘాలు, సామాజిక సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించి పెద్ద ఎత్తున పోరాటం చేశాయని తెలిపారు. నాడు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకొచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సమగ్రంగా విచారించి అక్రమంగా స్వాధీనం చేసుకున్న పెత్తందారుల నుంచి భూములు వెనక్కు తీసుకుని తిరిగి పేదలకు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025 మార్చిలో మంత్రి వర్గ ఉప సంఘం నియమించిందని తెలిపారు. అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/77 చట్టాన్ని యథాప్రకారంగా అమలు చేసి అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను కోల్పోయిన దళిత, గిరిజన బలహీన పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే కూటమి ప్రభుత్వం కూడా లక్షలాదిమంది దళిత బలహీనులకు తీవ్రమైన ద్రోహం చేసినట్టే అవుతుందన్నారు. ఇదే పద్ధతి ప్రభుత్వం కొనసాగిస్తే వ్యవసాయ కార్మిక సంఘం, సామాజిక సంఘాలను, కలిసొచ్చే సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ముత్యాలమ్మ, వెంకటేష్, దుర్గ, వెంకట్రావు, నాగేంద్రరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలి

మంత్రి సత్యప్రసాద్‌కు వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ అమరావతిలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు నూజివీడు సాధన సమితి జెఎసి అధ్యక్షులు మరీదు శివరామకృష్ణ సోమవారం వినతిపత్రం అందించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ వైసిపి పాలనలో నూజివీడుకు అన్యాయం జరిగిందని, ఎన్నికల ముందు సిఎం హామీ మేరకు ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేయాలన్నారు. మంత్రి స్పందిస్తూ ప్రజల ఆకాంక్షలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం

పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మొంథా తుపాన్ ప్రభావం కారణంగా ఏలూరు నగరంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. తుపాన్ దిశ మార్చుకుంటూ తూర్పు గోదావరి వైపునకు కదులుతున్నందున వర్షపాతం తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుపాన్ ప్రభావం మంగళవారం బలపడనుండడంతో ఏలూరు మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలోని ప్రధాన రోడ్లపై ఉన్న భారీ ఫ్లెక్సీలను, హోర్డింగులను తొలగించారు. అదేవిధంగా శానిటేషన్ సిబ్బంది డ్రెయినేజీల్లో అడ్డుగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో వాహనదారులు, పాదచారులు



తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించింది. అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. చెట్ల కింద, పాడుబడిన ఇళ్లల్లో ఉండరాదని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్లి కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటల కంట్రోల్ రూమ్ నెంబర్ 18002331077, 9491041419 ద్వారా సహాయం అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించిన ఎంపీ ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. సమస్యలను సావధానంగా విన్న ఎంపీ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని సూచించారు. అనంతరం వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న 68 మంది లబ్ధిదారులకు సిఎం సహాయనిధి నుంచి రూ.50,15,862 విలువైన చెక్కులను అందించారు. ఆర్థిక సమస్యలతో వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న వారికి సిఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందించడానికి ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఎంపీకి లక్కీ డ్రా మోసంపై ఫిర్యాదు

ఏలూరు అర్బన్ :కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ తమ్మిరెడ్డి బ్రహ్మయ్య చేసిన నకిలీ లక్కీ డ్రా మోసంపై రాజవరం గ్రామంలో కొంతమంది మహిళలు సోమవారం ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్‌కు ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేశారు. రాజవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బ్రహ్మయ్య అనుమతులు లేకుండా అమాయక మహిళలకు మాయమాటలు చెప్పి లక్కీ డ్రా లో డబ్బులు కడితే మీకు ఎక్కువ డబ్బులొస్తాయని, డ్రెస్సింగ్ టేబుల్, దివాన్ మంచం, ఏసి, గోల్డ్ ఇంకా అనేక వస్తువులు వస్తాయని చెప్పి వందల రూపాయల నుంచి రూ.వేలు దండుకుంటూ తీరా అమాయకుల వచ్చేసరికి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నట్టు మహిళలు చెప్పారు. కొయ్యలగూడెం మండల చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 500 మందితో వాట్సప్ గ్రూప్ నిర్వహిస్తూ, ఈ స్కీం నడుపుతూ సుమారు కోటి రూపాయలు వసూలు చేసినట్లు చెప్పారు. స్పందించిన ఎంపీ కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి నిర్వాహకుడిపై తగు చర్యలు తీసుకుని బాధితులందరికీ వారి నుంచి తీసుకున్న డబ్బులు అందించాలని ఆదేశించారు.

పిఎంశ్రీ పాఠశాల విద్యార్థులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - పెదపాడు

పిఎం శ్రీ పాఠశాల విద్యార్థులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ క్యాంపు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఆల్ ఫెయిత్ ప్రేయర్ చేసి, స్కౌట్, గైడ్ విద్యార్థులకు శిక్షణ సర్టిఫికెట్లు ఇచ్చారు. జిల్లా సెక్రటరీ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పాఠశాలలో స్కౌట్, గైడ్స్ యూనిట్లు ప్రారంభించాలని, విద్యార్థుల్లో క్రమశిక్షణ ఇది అత్యవసరమని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో అనేక రుగ్మతలను తొలగించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మ మాట్లాడుతూ ప్రతి స్కౌట్ విద్యార్థి ఆదర్శవంతమైన వ్యక్తిగా సమాజంలో నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ గణేష్‌కుమార్, కో ఆప్షన్ మెంబర్ రామకృష్ణ, శిక్షణ అధికారులు ప్రసాద్, దుర్గాలక్ష్మి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, దుర్గారాణి, సౌజన్య పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ శాసనమండలి సభ్యులు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావులకు విజయవాడలోని వారి నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించినట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా బిసి విభాగం కో-ఆర్డినేటర్ కొండపల్లి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గర్భిణులకు, బాలింతలకు ఇంటింటికి వెళ్లి పౌష్టికాహారం అందించినట్లు అక్కిరెడ్డిగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు వర్కర్ పల్లిపాము రాజకుమారి తెలిపారు. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడులో అంగన్వాడీ ప్రీస్కూల్ పిల్లలకు, తల్లులకు, గర్భిణులకు గుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్, పాల ప్యాకెట్లు, తల్లులకు టిహెచ్‌ఆర్ పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నీరజ నాయుడు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ముగ్గురు బైక్ దొంగలు అరెస్టు

రూ.10 లక్షల విలువైన 19 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి పోలీసులు ముగ్గురు బైక్ దొంగలను సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.పది లక్షల విలువైన 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ సోమవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ వివిఎస్‌వి.భద్రరావు ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి కాలనీ- దేవపూడి రోడ్డులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. కొచ్చర్ల నుంచి మోటార్ సైకిల్‌పై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండడాన్ని పోలీసులు గమనించారు. పోలీసులు బైకును ఆపేందుకు ప్రయత్నించగా ఆపకుండా పారిపోవడానికి ప్రయత్నించడంతో ఎస్ఐ వీరభద్రరావు వారిని వెంటాడి పట్టుకున్నారు. వీరిలో విజయవాడ అరండల్ పేటకు చెందిన జలసూత్రం సాయిసురేష్‌కుమార్(28), ప్రొద్దువాకకు చెందిన యండూరి జీవన్‌రాజు(23), విజయవాడ అరండల్ పేటకు చెందిన (సిసిఐఎల్) ముగ్గురు కలిసి కొంతకాలంగా విజయవాడ, తాడేపల్లి, అజిత్‌సింగ్‌నగర్, దేవపూడి, కోరుకొల్లు, ముదినేపల్లి తదితర ప్రాంతాల్లో 19 మోటార్ సైకిళ్లు, మొబైల్ ఫోన్ ఒకటి దొంగతనాలు చేశారు. వీరు దొంగలించిన వాహనాలను మండలంలోని ప్రొద్దువాక గ్రామానికి చెందిన కుర్మా సుధాకర్ వద్ద దాచి ఉంచారు. దొంగలు ఇచ్చిన సమాచారం మేరకు కుర్మా సుధాకర్ వద్ద నుంచి పోలీసులు దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చేదించడంలో మంచి ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ బి.నాగబాబు, పి.పవన్‌కుమార్, హోంగార్డ్స్ వై.నాగరాజు, జి.శివకోటయ్యలను ఎస్‌పి అభినందించారు.

సీబీ కెనాల్‌లో గుర్తు తెలీని మృతదేహం

ముదినేపల్లి :సీబీ కెనాల్‌లో గుర్తు తెలీని పురుషుని మృతదేహం రైతులకు కనిపించింది. మండలంలోని చేవూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని జమ్మలగుంట తూము వద్ద కాలువలోని గుర్రపు డెక్కలో పురుషుని మృతదేహం చిక్కుకుంది. ఆదివారం మధ్యాహ్నం చేపల చెరువుల వద్దకు వెళ్తున్న రైతులు కాలువలో ఉన్న మతదేహం గుర్తించి విఆర్‌ఒ రామసుబ్బయ్యకు సమాచారం అందించగా, ఆయన కాలువ వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద నుంచి ఈ గుర్తు తెలీని మృతదేహం కొట్టుకొని వచ్చి ఉండొచ్చని రైతులు చెబుతున్నారు.

ఇసుక లారీ పట్టివేత

జీలుగుమిల్లి :ఆంధ్రాలోని ఇసుక ర్యాంపుల నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి గ్రామ శివారు జాతీయ రహదారిపై అర్ధరాత్రి సమయంలో వాహన తనిఖీలు చేస్తుండగా కొవ్వూరు సమీపంలోని ఇసుక ర్యాంపు నుంచి లారీలో ఇసుకను లోడ్ చేసుకొని తెలంగాణ రాష్ట్రానికి వెళ్తుండగా మార్గ మధ్యలో ఆపి తనిఖీ చేయగా సరైన పత్రాలు లేకపోవడంతో లారీని పట్టుకోగా డ్రైవర్ పరారైనట్లు తెలిపారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం

కొయ్యలగూడెం :ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని కన్నాయగూడెం గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... గవరవరం నుంచి దేవరపల్లి కోళ్ల ఫారం వైపు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు ఆకస్మికంగా బేరింగ్ ఇరిగిపోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డుమధ్య బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఆర్‌టిసి బస్సు వస్తుండగా ప్రమాదం తృటిలో తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు జరగలేదు. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను పక్కకు తరలించారు.

వసతి గృహం.. సమస్యలకు నిలయం

నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి సముదాయం సమస్యలకు నిలయంగా మారింది. అసౌకర్యాలతో అక్కడ ఉన్న 180 విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడం, దోమతెరలు, పరుపులు, దుప్పట్లు అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. నీటి పంపులు లీకవుతున్నాయి. సమస్యలతో సతమవుతున్న విద్యార్థులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.


నేల పైనే నిద్రిస్తున్న విద్యార్థులు

- కిటికీలకు లేని తలుపులు
- అందని దోమతెరలు, పరుపులు, దుప్పట్లు
- నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు
- లీకవుతున్న నీటి పంపులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి సముదాయం (ఇంటిగ్రేటెడ్ హాస్టల్) అసౌకర్యాలకు నిలయంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ లోపల గదుల్లోని కిటికీలకు సక్రమంగా తలుపులు లేవని, కొన్ని తలుపులకు పెద్ద పెద్ద రంధ్రాలు ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దోమ తెరలు ఏర్పాటు చేయకపోవడంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీక్ అవుతున్న పంపులు, విద్యుత్ బోర్డులకు ప్యానెల్స్ లేకపోవడం తీవ్ర భయాందోళన కలిగిస్తోంది. పాత బస్తాలు, కొత్త బస్తాల్లోని బియ్యం ముక్క పురుగులతో నిండి ఉంది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా కూటమి ప్రభుత్వం సన్నని బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తుంది. అధిక మొత్తంలో స్టాకు అందించడం వల్ల ముక్క పురుగులు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చలిగాలులు ముదురుతుండడంతో కొత్తగా దుప్పట్లు ఇవ్వకపోవడంతో పాటు పరుపులు కూడా అందించకపోవడం వల్ల విద్యార్థులు నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.


కిటికీలకు లేని తలుపులు

ఉన్నతాధికారులకు నివేదిక అందించాం

వార్డెన్ యు.కోటేశ్వరరావు



వేసవి సెలవుల్లో ఉన్నతాధికారుల ఆదేశంతో మరమ్మతులు చేపట్టామని హాస్టల్ వార్డెన్ యు.కోటేశ్వరరావు తెలిపారు. కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు నిలిపివేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఉండిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం హాస్టల్లో నెలకొన్న అసౌకర్యాలు, బియ్యంలో ఏర్పడ్డ ముక్క పురుగుల విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు వివరించారు. తనకు సాధ్యమైనంత వరకు సొంత ఖర్చులతో కొన్ని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరుపుల విషయమై మాట్లాడుతూ బిసి హాస్టల్స్‌కు మాత్రమే పరుపులు సరఫరా అయ్యాయని, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌కు సరఫరా చేయలేదని చెప్పారు. కొన్ని హాస్టల్స్‌కు దాతలు అందించారన్నారను. తాము కూడా దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు.

ఒక్క ప్రాణనష్టం కూడా సంభవించకూడదు

మొంథా తుపాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి
కలెక్టర్, ఎస్‌పి, ప్రజాప్రతినిధుల ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న శిథిల భవనాల్లో ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం తుపాన్ పరిస్థితిపై జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల, ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తుపాన్ కారణంగా ఒక్క ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారని, తుపాన్ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా శిథిలావస్థలో ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న ఇళ్లలో ఉన్న ప్రజలను వెంటనే వారి బంధువుల ఇంటికి గాని, లేదా ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయక శిబిరాలకు గాని తరలించాలన్నారు.

మొంథా తుపాన్ పరిస్థితులపై పార్టీ మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, అవసరమైన చోట సహాయ చర్యల్లో పాల్గొనాలని స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఏలూరు స్పోర్ట్స్ :పెను తుపానుగా మారుతున్న మొంథాను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ ఆస్తి, ప్రాణనష్టాన్ని సాధ్యమైనంత మేర నివారించేందుకు శక్తిపంచన లేకుండా కృషి చేయాలని, ముఖ్యంగా కైకలూరు, పెదపాడు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆయన జిల్లా పోలీస్ బలగాలను సమాయత్తం చేశారు. జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో తొలిసారిగా ఏలూరు డిస్ట్రిక్ట్ రెస్పాన్స్ ఫోర్ (ఇడి ఆర్ఎఫ్) బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు అత్యవసర సేవలకు 112కు కాల్ చేయాలన్నారు.

సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలి : ఏపి ఎన్‌జిఒస్

ఏలూరు అర్బన్ : తుపాను ముందు జాగ్రత్త చర్యల్లో, తుపాన్ అనంతర కార్యక్రమాల్లో పూర్తి బాధ్యతతో, మానవతా దృక్పథంతో, సేవా భావంతో పాల్గొనటం ఉద్యోగిగా మన మన విధి మాత్రమే కాదని, బాధ్యత కూడా అని ఏపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొంథా తుఫాను నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం క్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తుపాను నియంత్రణ, ప్రజల రక్షణ కోసం విశేషమైన కృషి చేస్తుందని, ఈ సందర్భంగా ప్రజల పట్ల, సమాజం పట్ల, జిల్లా, రాష్ట్రం పట్ల బాధ్యతగా పనిచేయటం ఉద్యోగుల కర్తవ్యమని తెలిపారు. ప్రతి ఉద్యోగి తన పరిధిలోని అధికారుల మార్గదర్శకత్వంలో చురుకుగా పాల్గొని సహాయక చర్యల్లో భాగస్వామి కావాలని, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు, ప్రాణ నష్టం తగ్గించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, అవసరం అయితే సంఘం తరఫున కూడా సహాయ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని తెలిపారు.

నీట మునిగే ప్రాంతాలను గుర్తించాలి

కలిదిండి :మండలంలో నీట మునిగే ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక లాల్వా మురుగు కాలువపై కొట్టుకుపోయిన వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. తుపాన్ దృష్ట్యా ప్రజలను కలుపుకుని సమన్వయంతో వెళ్లేలా స్థానిక పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. లంక గ్రామాల్లో ముంపునకు గురయ్యే ప్రజలతో మాట్లాడారు. కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

మొంథా తుపాన్ దృష్ట్యా ఉప్పుటేరు తీర గ్రామాల్లోని మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని ఉప్పుటేరు తీర గ్రామాలైన సున్నంపూడి, దుంపలకోడుదిబ్బ గ్రామాల్లో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు ఈ రెండు రోజులు వేటకు వెళ్లవద్దని కోరారు.

రైతుల అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి :మొంథా తుపాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ భాషా అన్నారు. మండలంలోని పెదకామనపూడి, చినకామనపూడి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి తుపాన్ కారణంగా నేలవాలిన పైరును క్షేత్ర సందర్శన చేసి విపత్తును ఎదుర్కొనేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, జి.సంధ్య, రైతులు పాల్గొన్నారు.

ఎర్రకాలువకు వరద నీరు

జంగారెడ్డిగూడెం :ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కెకెఎం ఎర్ర కాలువ ప్రాజెక్టుకు వరద నీరు చేరుతుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం నీటి మట్టంతో 82.36 మీటర్లు చేరుకుంది. ఇన్ ఫ్లో 800 క్యూసెక్కుల వరద నీరు రావడంతో దిగువకు 2500 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు డిఇ సునీత సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జీలుగుమిల్లి :తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బర్రింకలపాడు, రౌతుగూడెం సమీపంలోని భారీ వర్షాలకు రహదారిపై నుంచి ఉధృతంగా ప్రవహించే వాగులను పరిశీలించారు. కొండవాగులు పొంగే ప్రాంతాల్లో కల్వర్టుల గుండా ప్రజలు దాటకుండా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

చింతలపూడి :మొంథా తుపానును ఎదుర్కొనేందుకు వైద్య అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి కోరారు. ఏరియా హాస్పిటల్ వైద్యులతో, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాముకాటు, కుక్క కాటు, అన్ని రకాల అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు తుపాను ప్రభావం తగ్గేంతవరకు ఆసుపత్రిలోనే ఉండేందుకు భోజనం, బెడ్‌ల సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు.

నూజివీడు టౌన్ :అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న చెప్పారు. ఆమె కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ గత అనుభవాలను పరిశీలించి చెరువుల వద్ద పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చన్నారు.

మండలంలోని రామన్నగూడెంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారావు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. దీనిలో భాగంగా మండలంలోని రైతులందరూ వరి, మినుము పంటలను రానున్న రెండు రోజులు పంట కోతలను వాయిదా వేసుకోవాలని చెప్పారు.

ముసునూరు :మండలంలోని చెక్కపల్లిలో నూజివీడు సిఐ రామకృష్ణ, తహశీల్దార్ డి.ప్రశాంతి, ఎస్ఐ ఎం.చిరంజీవి, ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు పర్యటించి పెద్ద చెరువు వద్ద క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ప్రజలకు రక్షణ చర్యలు తీసుకునే విషయంలో అధికారులకు తగిన సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రజలు భయాందోళన చెందకుండా, అధికారులు చెప్పే సూచనలు, హెచ్చరికలు తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరి, పత్తి పంటలు కోత దశలో ఉండటంతో పలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆలూరు చాముండేశ్వరి చెప్పారు. మండలంలోని ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో వరి, పత్తి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

జంగారెడ్డిగూడెం : ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లో వరి పంటపై సంక్షిప్త క్షేత్ర సందర్శన మండల వ్యవసాయ అధికారి సి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నాగేంద్రబాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా స్వర్ణ, సంపద స్వర్ణ రకాల వరి పంటలు పడిపోవడం గమనించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరంపేట, పంగిడిగూడెం, రైతు సేవా కేంద్రం సిబ్బంది నాయక్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని టిడిపి పట్టణ కొండ్రెడ్డి కిషోర్ చెప్పారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ మంగళవారం తుపాన్ మరింత తీవ్ర ప్రభావం చూపించనుందని, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాలపై మరింత దృష్టి పెట్టాలని, అత్యవసర మైన మందులు, ఆహార సరఫరా అందించేందుకు ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆర్‌అండ్‌బి, జలవనరులు, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అత్యవసరమైతే రెవెన్యూ వారు ఏర్పాటు చేసిన 9652742434 ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని చెప్పారు.

మండవల్లి :ముంచుకొస్తున్న మొంథా తుపాను ప్రభావంతో ప్రమాదాలు సంభవించకుండా ముందుగానే లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తహశీల్దార్ కె.గోపాల్ తెలిపారు. మండలంలోని మణుగూరు, చింతపాడు, పులపర్రు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని చెప్పారు. గ్రామాల్లో అధికారులను నియమించడంతోపాటు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

58 మంది గర్భిణులు ఆసుపత్రులకు తరలింపు

ముదినేపల్లి :మొంథా తుపాన్ నేపథ్యంలో మండలంలో ఐదు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేకాధికారి కె.యోహాన్ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మాట్లాడారు. ముదినేపల్లి, అల్లూరు, గురజ జెడ్‌పిహై స్కూల్స్, దేవపూడి చేవూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పొద్దువాక గ్రామస్తులు కొంతమందిని దేవపూడి పునరావాస కేంద్రానికి తరలించి వసతి కల్పించామన్నారు. మండల వ్యాప్తంగా 66 మంది గర్భిణులకు గుర్తించగా వారిలో 58 మందిని ఇప్పటికే పిహెచ్‌సిలకు తరలించామన్నారు. సాయంత్రం జెడ్‌పి సిఇఒ శ్రీహరి, మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పునరావాస కేంద్రాలను, సెల్ టవర్స్‌ను పరిశీలించారు. తహశీల్దార్ లతీఫ్ పాషా, ఎంపిడిఒ వై.రామకృష్ణ, ఆర్ఐ రాజశేఖర్, డిప్యూటీ ఎంపిడిఒ బి.అశోక్, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

కలిదిండి :మండలంలోని పడమటిపాలెం పంచాయతీ పరిధిలో ముంపునకు గురైన బంకు కాలనీ వాసులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం ముంపు ప్రాంతాన్ని సందర్శించి తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణకు వివరించగా సోమవారం పునరావాస కేంద్రాన్ని తిరిగి ప్రారంభించినట్లు కలిదిండి, ముదినేపల్లి మండలాల ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు తెలిపారు. సుమారు 20 కుటుంబాలు శిబిరంలో ఉన్నాయి. సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు జక్కుల మహేష్, సిహెచ్.శ్రీకాంత్, పెరుమాళ్ల గోపీ, పి.సత్యనారాయణ, పరసా రాజేష్ సందర్శించి సదుపాయాలు, భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనధికార మద్యం దుకాణాలపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం మూడు అనధికార మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేసి, 25 డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి ఎ.ఆవులయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విస్తృత దాడులు నిర్వహించామని తెలిపారు. జిల్లాలో 2024 అక్టోబర్ 15వ తేదీ నుంచి 2025 అక్టోబర్ 27వ తేదీ వరకు 711 కేసులు అనధికార మద్యం దుకాణాలపై నమోదు చేసి, 715 మందిని అరెస్టు చేసినట్లు, 1584 లీటర్ల ఐఎంఎల్ లిక్కర్, 94 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని లైసెన్స్ దుకాణదారులు ఎలాంటి బెల్ట్ షాపులకు సరఫరా చేయకూడదని పేర్కొన్నారు.

పంచాయతీ భవనం నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కోర్టు తీర్పును అనుసరించి తమ అభ్యర్థనను పరిశీలించి తమ గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించాలని కోరుతూ కనకాద్రిపురం గ్రామస్తులు సోమవారం ధర్నా చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ ధర్నాలో గ్రామానికి చెందిన టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొని నినాదాలు చేశారు. హైకోర్టు 26598/2025 నెంబర్ రిట్ కేసులో తమ గ్రామస్తుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని కోరుతూ ఎంపిడిఒకు, గ్రామ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. ఈ అంశం కలెక్టర్ పరిధిలో ఉండగా పంచాయతీ భవనం కుంతలగూడెంలో నిర్మించేందుకు గ్రామ సర్పంచి, అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ధర్నా చేయాల్సి వచ్చిందని టిడిపి గ్రామ కార్యదర్శి రాజవరపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు అప్పలస్వామి, జనసేన గ్రామ కార్యదర్శి దుగ్గిరాల రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజవరపు శ్రీనివాసరావు, దుగ్గిరాల రాజు, అప్పలసామి నలమాటి సత్యభామ, టెక్కిన తిరుపతయ్య, లక్ష్మి, ఆకుల వెంకటేశ్వరరావు, మాచర్ల వెంకట గణేష్, పాల్గొన్నారు.

సెంట్రల్ విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సెంట్రల్ విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాలు ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సెంట్రల్ విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాలను ఎం.శేఖర్ బాబు గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పాఠకులతో కలిసి ముందుగా ప్రతిజ్ఞతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కౌలుదారు రైతులందరికీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు దాకరపు నాగేశ్వరరావు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. గతంలో సిసిఆర్ కార్డు దారులకు గత ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చిందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అన్నదాత సుఖీభవ పథకం సిసిఆర్ కార్డు రైతులకు పడలేదన్నారు. అన్నదాత సుఖీభవ చట్ట బద్ధత చేసి కౌలుదారులను గుర్తించాలన్నారు. ప్రభుత్వం సిసిఆర్ కార్డులకు పంట రుణాలు, ప్రభుత్వం ద్వారా ఇచ్చే వ్యవసాయ పరికరాలను రాయితీ ద్వారా కౌలు రైతులకు ఇప్పించాలన్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట నష్టాన్ని కౌలుదారులు ఎకౌంట్లోనే వేయాలన్నారు. సింగరాయపాలెం దళితవాడ నుంచి విశ్వనాథ్రపాలెం వరకు ఉన్న కైకలూరు నెంబర్ -2 డ్రెయిన్‌ను ఉపాధి హామీ కూలీల ద్వారా పూడికతీత పనులు చేయించి దళితవాడ ప్రాంతాల్లోనే మురుగునీరు అంతా బయటకు పారుదల అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ పవన్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. మీగడ సత్యనారాయణ, గేలం నరేష్, దాకరపు మధుబాబు, బత్రాజు రాధాకృష్ణ, బూరుబోయిన రాధాకృష్ణ పాల్గొన్నారు.